# బ్రతుకు తీపి

అమ్మ ఏదో చెపుతోనేవుంది. 'పోనీలేమ్మా, నీ వళ్ళు నయమై ఇంటికొచ్చావు. అంతే చాలు.' అంటూ ఇంకా ఏవో ఏవో...

—తను ఒక్కటీ వినిపించుకో లేదు. ప్రపంచమంతా ఒక్కసారి చలనం లేకుండా స్థాణువులా నిలిచిపోయినట్ల యింది. హృదయంలో క్రమ్ముకున్న శూన్యం జగమంతా ఆవరించుకున్నది.

ఏదో ఆలోచన! 'ఇందుకోసమేనా ఇంటికి వచ్చానూ! ఇందుకేనా ప్రాణాలకోసం ఇంత పెనగులాడింది?'

మళ్ళీ మళ్ళీ ఇదే ఆలోచన గంటకొట్టినట్లు తల్లో తిరిగింది. తూలుతూ నిద్రలో లేచి నడిచినట్లు గుమ్మందాకా వెళ్ళింది. ఏదో అలవాటుగా తనకు తెలీకుండానే అన్నది:

'అమ్మా, అల్లా కొంచెం దూరం షికారు వెళ్ళివస్తాను.'

అమ్మ ముఖంలో ఎక్కడలేని ఆత్రుత, భయమూ కనుపించాయి. తన్ను ఆపాలని ఎంతో ప్రయాసపడుతున్నట్లు కనుపించింది. కాని మళ్లీ ఆపడానికి ప్రయత్నించలేదు. తను ఆగనూలేదు.

అల్లాగే అంతులేకుండా నడుస్తూ వెళ్లింది.

అప్పుడే వర్షం కురిసి వెలసింది. వర్షాకాలంలో ఈ ఊరు ఎంత బాగుంటుందో. త్రోవపొడుగునా ఎన్నో రకరకాల పువ్వులు! చల్లగాలికి ఆనందంతో మెల్ల మెల్లగా ఊగి

పోతున్నాయి—నీటి ముత్యాలు రాలుస్తూ, ఎరుపు, నీలం, పసుపూ ఎన్ని రంగులో! దూరాన కొండలు నీలంగా ఆకాశాన్నంటుకుంటూ చుట్టూ గిరి గీసినట్లున్నాయి—నీరెండలో పచ్చికబయళ్ళు తళతళలాడుతున్నాయి. ఎంత ప్రశాంతంగా ఉంది. ఏమాత్రం జన సంచారం లేకుండా! కాని తనకు తోడుగా ఉంటుందని వెనకాలే అమ్మ లక్ష్మిని పంపుతుందేమో? వెనక్కి తిరిగి చూసింది. ఎవ్వరూ లేరు; అమ్మయ్య!

ఎంతసేపు నడిచిందో...ఇల్లాగే అంతులేకుండా నడుస్తూ వుంటే ఎంత బాగుండును! ప్రపంచమంతా ఎప్పుడూ పువ్వులతో, వర్షపు బిందువులతో, ఇల్లాగే ప్రశాంతంగా, మనోహరంగా వుంటే ఎంత బాగుంటుంది!...

క్రమంగా తను శానిటోరియమ్‌కు వెళ్లడం, ఒక రోజూ రెండు రోజులూ కాదు, ఎనిమిది నెలలు బాహ్యప్రపంచంతో సంబంధంలేకుండా బందీగా జీవితంగడపటమూ; అన్నీ ఒక్కటొక్కటిగా పూసగ్రుచ్చినట్లు జ్ఞాపకంవచ్చినాయి. అబ్బా! ఈ చల్లనిగాలికోసం, ఈ పచ్చని పువ్వులకోసం, వెన్నెలకోసం, స్వేచ్ఛకోసం, ఎంత పరితపించింది! అందరిలాగే తనూ జీవించివున్నానని, జీవిస్తున్నానని అనుకోవాలని ఎంత ఆరాటపడింది!

ఆవేళ మామయ్య వచ్చాడు. అప్పటికి తను శానిటోరియమ్‌కు వచ్చి మూడురోజులే అయింది. కాని, తనకు ఆ మూడు రోజులే మూడు యుగాలనిపించింది—తెల్లని దుస్తులతో మెషిన్లలా తిరిగే నర్సులు, నెత్తిమీద విధీ విసుగూ

లేకుండా తిరిగే ఫాను, చూసి చూసి విసుగుపుట్టింది. ఏమీ తోచక, రోజంతా కిటికీ దగ్గరే కూర్చునేది. కిటికీకి ఎదురుగానే ఎన్నో పెద్దపెద్ద చెట్లు దగ్గర దగ్గరగా పైనుంచి పచ్చని పందిరిలా వుండేవి. దూరాన బోర్డింగు స్కూలు గేటు మాత్రం కనుపించేది. రోజంతా ఎందరో పిల్లలు నవ్వుతో, అరుస్తో, అల్లరిచేస్తూ అటూ ఇటూ తిరుగుతూ వుండేవాళ్ళు. ఎంత స్వేచ్ఛగా వుండేవాళ్ళు! వాళ్ళని చూసినప్పుడల్లా తన కళ్ళు చెమ్మగిల్లేవి. మళ్ళీ ఒక్కొక్కప్పుడు, తనూ వాళ్ళతో తిరుగుతూవున్నట్టే వుండేది తనకు. కాని, నర్సు తనకి ఆమాత్రం స్వేచ్ఛకూడా ఇవ్వదలచుకోలేదు.

ఓరోజు మందలించింది: 'ఎప్పుడూ కిటికీ దగ్గరే కూర్చోకూడదమ్మా! చల్లగాలి నీవంటికి మంచిదికాదు.'

స్వయంగా వచ్చి కిటికీ మూసేసింది;— ఆ కాస్త ప్రపంచం దూరమైంది.

ఆవేళ మధ్యాహ్నంఅంతా ఏమీ తోచలేదు. ఉండి ఉండి ప్రక్క గదులలోనుంచి భరించలేని బాధతో మూలుగులు వినిపించేయి. తనకి పిచ్చెత్తినట్లయింది. బయట అందాన్ని, ఆనందాన్ని వెతుక్కుంటూ నలుగురితో కులాసాగా ఆడుతో, పాడుతో, ప్రపంచంలో బాధ వున్నదనే మరచిపోతుంటాం. కాని, ఇక్కడ నిరాశ, నిస్సహాయత, బాధ, నిస్పృహ, అన్నీ ప్రోగుచేసి కుప్పపోసినట్టయింది. ఆగి ఆగి వచ్చే ఈ ఆర్తనాదాలు ప్రపంచపు దుఃఖచరిత్ర, శంఖం పూది వినిపిస్తున్నట్లుంటుంది. అబ్బా!—ఎక్కడికో పారిపోవాలనిపిస్తుంది. వేరే ధ్యాసలేకుండా ఇక్కడే వుండడం ఎంత బాధ!

ఆరోజు సాయంత్రమే మామయ్య వచ్చాడు. వస్తూనే గది నాలుగు మూలలా చూస్తూ అన్నాడు: 'ఆయువు బాగుంటే గాయంఅంత సుఖం లేదు సుమా!' తెచ్చి పెట్టుకుని నవ్వాడు.

తెల్లబోతూ, కోపంతో అన్నది తాను:

'అదేమిటి మామయ్యా, అల్లా అంటావు?'

ఆయన అన్నాడు: 'అవునమ్మా, ఈ గదీ అదీ చూడు. ఎంత దర్జాగా వున్నదో! పైగా అందరూ ఇప్పుడు నిన్ను ఎంత శ్రద్ధగా చూస్తారు!'

ఏమి అర్థంలేని మాటలు! ఊరికే తనని ఓదార్చడానికే అంటాడేమో! ఈ గది బాగుంది; ఈ పరుపు బాగున్నది; ఇక్కడ నర్సులందరూ చాలా మంచివాళ్లు; నీకు త్వరగానే నయమవుతుంది; వచ్చినప్పటికన్నా ఎంత ఆరోగ్యంగా వున్నావు!-అబ్బా! ఎన్ని అబద్ధాలు చెప్పతారో తన కోసం! తనని సంతోషపరచాలని ఎంత ప్రయాసపడుతారో!

అందరూ అంతే! తమ మాటలు వింటో ఈ దిక్కులేనివాళ్లంతా మోసపోతారనే వారి ఉద్దేశం.

తనకి తెలుసు తన ఆరోగ్యం బాగాలేదని. ఎంతో శ్రమపడితేనే గాని తనకి నయంకాదని! అయినా తనకి త్వరలోనే ఆరోగ్యం కలుగుతుంది! తనలోని అణువు అణువు ఆరోగ్యంకోసం పరితపిస్తోంది! తన హృదయంలో ప్రతి ఒక్క కోరికా తన ఆరోగ్యాన్నే చుట్టుకు తిరుగుతున్నది.

తనకోసం, బావకోసం తనకు తప్పకుండా నయమవుతుంది. ఎన్నిరోజులైనా బావ తనకోసం కనిపెట్టుకుని వుం

టాడు. బావకీ తనకీ పెళ్లవుతుంది. తమ జీవితమంతా పువ్వులతో నిండిపోతుంది. ఈ ఆశే తనకి ప్రాణం పోస్తోంది.

అబ్బా! ఈ జీవితాన్ని ఎంతగా ప్రేమిస్తున్నది ! జీవితానికి దూరమైనప్పుడే తెలుస్తుంది జీవితం ఎంత ప్రియమైనదో ! అస్తమిస్తోన్న సూర్యుడిని చూస్తో, నది అంచున బావా తనూ ప్రొద్దు వాలేవరకూ ఇసుకలో ఆడుకోవడం; వెన్నెలరోజుల్లో పడవషికారు వెళ్ళితే, చల్లగాలిలో నీళ్లు చింది తన బుగ్గలనిండా పడడం; రాత్రి సినిమానుంచి వస్తుంటే వర్షంలో బావ పట్టుకందువా తనమీద కప్పడం; ఇల్లా ఎన్నో—మధురమైన జ్ఞాపకాలు, కమ్మని తావిలాగ తన హృదయాన్ని చుట్టుకొంటున్నాయి. తనకి జీవితమందు ఆశ కలిగిస్తున్నాయి !

ఇంకా ఎన్నో—జీవితంలో అందమైనవి ! రంగురంగుల పువ్వులు; సన్నని సరిగంచు వల్లెలు; పసిబాల నవ్వు; సైగల్ పాటలు; ఎడ తెగని పుస్తకాలు; దూరమైనకొద్దీ మరింత ప్రియమౌతాయి ! ఎన్ని రకరకాల పరిమళాలతో నింపుకొంటాయో ఈ జీవితాన్ని ! బ్రతుకు తీపి ఎప్పటికీ వదలదు.

...తనకు తప్పకుండా నయమౌతుంది !

ఎంతమంది వచ్చేవారో తనని చూడడానికి శానిటోరియమ్‌లో. ఎన్నిరకాల ప్రకృతులు ! కాని, ఒక్కరూ మూడు నిమిషాలకన్న ఎక్కువ కూర్చున్నట్లు జ్ఞాపకంలేదు. డ్యూటీగా వచ్చి, ముళ్లమీద ఉన్నట్లు వుండి, వెళ్ళిపోయేవారు. అవును, జీవితానందంలో మునిగి తేలేవారు మృత్యు

వుకు సమీపంగా వున్నవాళ్ళ దగ్గర ఎక్కువసేపు కూర్చో
రులే! వారిని గురించి ఎక్కువ ఆలోచించలేరు! వెలివేసినట్లు
తనెంత బాధపడేదో! ఎంత ఒంటరితనాన్ననుభవించేదో!
ఎవరికి అర్థమౌతుందీ?

ఆఖరుకి, బావకూడా ఎక్కువగా రాలేదు. ఒక్కసారి
మాత్రమే వచ్చాడు. రెండు నిమిషాలకన్న ఎక్కువ వుండ
లేదు. ఏవో రెండు పొడిమాటలు మాట్లాడి వెళ్ళాడు. మళ్లీ
రానేలేదు. అమ్మ చెప్పేది: 'అతను నువ్వు బాధపడుతూ
వుంటే చూడలేడమ్మా, అందుకని రాడు. నువ్వింకత్వరగానే
ఇంటికొస్తావుగదూ!'

అవును పాపం; బావది ఎంత సున్నితమైన హృదయం!
ఏమాత్రం బాధ అయినా చూడలేడు. అణుమాత్రమైనా
అందవికారాన్ని సహించలేడు—మొదట బావ తరుచు ఉత్త
రాలు వ్రాసేవాడు. పెద్దపెద్ద ఉత్తరాలు, ఎంతో ప్రేమతో,
ఎంతో ధైర్యంచెబుతో! ఆ తరువాత క్రమంగా ఉత్తరాలే
రాలేదు. అమ్మ ఎన్నో సాకులు చెప్పేది.

'అతనికి పరీక్షలటమ్మా, చదువుకుంటున్నాడట. ఏదో
ఉద్యోగంకోసం తిరుగుతున్నాడటమ్మా. ఢిల్లీ వెళ్ళాడుట.
వచ్చాక వ్రాస్తాడేమో!' ఇట్లాగే ఇంకా ఏవో ఏవో; తను
అన్నీ నిజమనే నమ్మింది.

ఓసారి, పిన్ని తనని చూడటానికి వచ్చింది. ఎంతో
ఆప్యాయంగా దగ్గర కూర్చుని ఎన్నో ప్రశ్నలువేసింది.
తన కేమీ ఉత్సాహం కలుగలేదు. తనకి నయం కాకపోతే
పిన్నికూతురు రజనిని బావ పెళ్ళిచేసుకోవచ్చు. కూతురి

వివాహానికీ, తన ఆరోగ్యానికీ వున్న సంబంధం ఆవిడకు తట్టకుండా వుంటుందా? ఈనిమిషంలో మాత్రం ఆమె అదే ఆలోచిస్తూవుండకూడదూ? స్వార్థాన్ని పూర్తిగా మరచిపోగలరా? తనకు నమ్మకం కలగలేదు.

'రజని కాలేజీలో చేరిందా?'

'బావ కాలేజీలోనేనా?'

ఏవేవో అర్థంలేని ప్రశ్నలువేసింది తను. పిన్ని కలవరపడింది. ఒకవేళ బావ రోజూ రజనిని కలుసుకుంటూ వుండొచ్చు.

ఎవరు వచ్చినా ఎవరు రాకపోయినా, అమ్మ, లక్ష్మి రోజూ వచ్చేవారు. తనతోపాటు ఖైదీల్లా కూర్చునేవారు. అమ్మ ఎంత శ్రమపడేది! ఎన్ని కబుర్లు చెప్పేది. మాటలతో, ప్రేమతో తనకు జీవంపోసింది. తనకు ఎల్లాగైనా ఆరోగ్యం కలగాలని అమ్మ పట్టుపట్టింది.

తూగుతూ, లేస్తూ, జీవితాన్ని గురించి కలలుకంటూ రోజులు గడిచేవి. నర్సు మాత్రం మధ్యమధ్యన మందివ్వాలనో, టెంపరేచర్ చూడాలనో, ఏదో వంకతో వచ్చివెళ్లేది. ఓరోజు నిద్రలేపి చెప్పింది:

'రేపు ఇంటికెళ్లొచ్చు.' డాక్టరు చెప్పింది.

తనకి నమ్మకంకలుగలేదు. నిజమే! నిజంగానే! తనలో ఉత్సాహం కట్టలు తెంచుకొని ప్రవహించింది. అణువు అణువులో క్రొత్తచైతన్యం కలిగింది. ఎనిమిది నెలలకి తనకి విముక్తి దొరికింది. తనూ నలుగురిలో మనిషి ననిపించుకో వచ్చు.

ఇంటికి వచ్చినరోజే బావ వస్తాడనుకుంది. రాలేదు. రెండోరోజూ రాలేదు. మూడోరోజూ రాలేదు. తన కేదో నిరాధారంగా అగాధంలోకి కృంగిపోతున్న ట్లనిపించింది. శానిటోరియమ్‌లో ఉన్నన్నాళ్ళూ బయట జీవితమంతా ఒక మధుర స్వప్నంలా తోచేది; కాని, ఇక్కడ ఆశ, నిరాశ, ఒంటరితనం, శూన్యతా—ఇవే.

నాలుగో రోజు బావ ఉత్తరం వ్రాశాడు. తనకు వళ్ళు నయమై ఇంటికివచ్చినందుకుఎంతోసంతోషిస్తున్నాననిఅంతే

అతరువాత అమ్మ చెప్పింది: 'బావ రజనిని పెళ్ళిచేసు కుని చాల రోజులైంది.'

నిజమే! తను నమ్మలేకపోయింది. అమ్మ ఇంకా చెప్తూనే వుంది:

'నీకు నయం కాదనుకున్నారమ్మా. అత్తయ్య పట్టు పట్టింది. బావకు తప్పలేదు. అదీ మేనరికమే గదా అను కున్నారు. అవును. ఎన్నాళ్ళని కనిపెట్టుకుంటారమ్మా. నీవు బాధపడతావని ఇన్నాళ్ళూ చెప్పలేదు. ఇంటికి వచ్చాక చెప్పవచ్చనుకున్నాను. పోనీలేమ్మా. నీకు నయమైంది. అంతే చాలు.'—ఇంకా ఏవేవో—తను వినిపించుకోలేదు, బొమ్మలా నిలబడిపోయింది...

అబ్బ! ఎంత దూరం నడిచింది! ఇంక ముందుకు వెళ్ళ లేకపోయింది. అలసిపోయి తిరిగి ఇంటివేపు నడిచింది.

అమ్మ తెలిసే తనకు చెప్పలేదు. తెలిసే తనని మోసం చేసింది. అబ్బా! తనకి తెలిస్తే తను నిరాశతో, బాధతో కృంగిపోతుందేమోనని, తన కింకెప్పటికీ ఆరోగ్యం కలగదనీ

భయపడిందేమో, పాపం! ఎంత మమకారమో!

అబ్బా! ఎంతసేపని నడుస్తూవుంటుంది! ఈ కాస్త దూరం గడిచిపోతుంది! మళ్ళీ ఆ ఇంట్లోకే వెడుతుంది! మళ్లీ అదే చీకటి. అదే నిరాశ!

ఉన్నట్టుండి, చల్లగాలికి రాలిన పూవొకటి ఎగిరి కాలి మీద పడింది. వంగి చేతిలోకి తీసుకుంది. ఎంత అందమైన పువ్వు! ఎంత మంచి వాసనో!

కళ్ళు కద్దుకుంది. కళ్లు చెమ్మగిల్లాయి.

ప్రొద్దు వాలుతోంది! కిలకిలమంటూ పక్షులన్నీ గుంపులు గుంపులుగా గూళ్లకు పోతున్నాయి. ఎక్కడో, ఏ చెట్టుమీదో, ఏ గూట్లోనో, బెదురుతూన్న కళ్లతో తల్లి కోసం ఎదురుచూసే పసికూనలు స్ఫురణకు వచ్చాయి. కళ్లు తుడుచుకుంది.

పోనీ, బావ ఎక్కడో సుఖంగా వుంటేసరి! తన కింకేం కావాలి! తను ఇప్పుడు ఆరోగ్యంగా వున్నదిగదా! తను మళ్లా చదువుకుంటుంది. యమ్. ఎ. దాకా చదువు కుంటుంది. తనకోసం అమ్మ ఎంత శ్రమపడుతుంది! ఆవిడ కోసం తను సంతోషంగా వుంటుంది. తనకే నవ్వొచ్చింది.

నిండు ప్రవాహంలో మునిగిపోతున్న వ్యక్తికూడా ఒడ్డుకు చేరడానికి పూచికపుల్లయినా దొరుకుతుందేమో నని వెతుక్కుంటాడు. తను జీవించడానికి వంకలు వెతుక్కుంటు న్నది. బ్రతికివుండడానికి ఏదో వంక కావాలి. ఏదో ఆసరా దొరకాలి. ఈ జీవితమంటే ఎంత ప్రేమో!

.. గుమ్మం ఎక్కుతూ పువ్వు తల్లో పెట్టుకుంది.